వీర జవాన్‌కు జోహార్లు





కలెక్టరేట్ ఎదుట జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న ప్రైవేటు స్కూల్స్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటీ నాయకులు, సభ్యులు

కర్నూలు(సెంట్రల్): యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు కర్నూలు నగరంలో పలు సంఘాలు ఘన నివాళులర్పించాయి. ప్రైవేట్ స్కూల్స్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ, సీపీఐ నగర కమిటీ, అవాజ్ కమిటీ తదితర సంఘాలు శనివారం నగరంలో వీర జవాన్‌కు జోహార్లు అంటూ నివాళులర్పించాయి. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు జవాన్ మురళీనాయక్ చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. దేశమంతా వారి కుటుంబానికి అండగా నిలవాలని అసోసియేషన్ నాయకులు వాసుదేవయ్య, నాగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు కోరారు.

మురళీనాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆపరేషన్ సింధూరలో మృతి చెందిన జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్‌జిలానీ బాషా కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్థాన్‌కు కోలుకోకుండా దెబ్బతీయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, అనంతరత్నం మాదిగ, బతుకన్న, బాజిరన్న,షేక్ ఖాజా హుస్సేన్, వెంకట సుజాత, లాజరస్, షేక్ రిమాజుద్దీన్, సయ్యద్ ఖాద్రీపాషా, అబ్దుల్ హై, ఆర్.ప్రతాప్, అభి నాయుడు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలి..

పహల్గాంలో అమాయకులను బలిగొన్న ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

చెప్పాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీ నాయక్‌కు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సోమన్న, నాగేంద్రమ్మ, భారతి, మునెమ్మ పాల్గొన్నారు.

అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో...

యుద్ధంలో పాకిస్థాన్‌తో పోరాడుతూ అమరుడైన మురళీనాయక్‌కు అవాజ్ కమిటీ ఘన నివాళి అర్పించింది. శనివారం సంఘం కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్, కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌ల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

భరతమాతకు క్షీరాభిషేకం



భరత మాత చిత్ర పటానికి పాలాభిషేకం

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భరత మాత చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి పాటల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉగ్రదాడులను తిప్పికొట్టడంలో నరేంద్ర మోడీ విజయం సాధించారని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు అనైతికం

కర్నూలు(సెంట్రల్): సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయ రెడ్డి ఇంట్లో అనుమతి లేకుండా పోలీసులు సోదాలు చేయడం అనైతికమని యునైటెడ్ జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలం సత్యనారాయణ, చిన్న రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, చంద్రమోహన్ శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా ఇంట్లోకి చొరబడి తనిఖీలు చేసిన తీరు ధోరణి దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. పాత్రికేయులను భయపెట్టడానికి కూటమి ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తుందన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

నేడు జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్: కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాలకు చెందిన జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాప్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు డోన్‌లోని శ్రీ సుధ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బీడీ సుధీర్ రాజు, డి.ఖాజా హుసేన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 'ప్రజాసైన్స్ ఉద్యమం – తాత్వికత ప్రస్తుత కర్తవ్యాలు' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ బాల సుబ్రహ్మణ్యం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 'జన విజ్ఞాన వేదిక నిర్మాణం కొన్ని ప్రాధాన్యతలు' అనే అంశంపై జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఉపన్యసిస్తారని తెలిపారు.

బెన్నెమ్మ వేణుగోపాల్‌కు సాహితి రత్న పురస్కారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత్రి బైరపోగు బెన్నెమ్మ వేణుగోపాల్‌కు సాహితి రత్న జాతీయ పురస్కారం లభించింది. ఏలూరులో నిర్వహించిన అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక సాహితి సంబరాల్లో ఆమెకు కళావేదిక చైర్మన్ కత్తి మండ ప్రతాప్‌చే పురస్కారం అందజేశారు. ఈ సంస్థ సాహితి, సాంస్కృతిక కృతువులో భాగంగా తెలుగు భాషా, తెలుగు సాహిత్యం, తెలుగు కళలు, తెలుగు సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సాహిత్య ప్రభంజనం సృష్టిస్తూ ఆమె రచనలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే తాను గణేష్ పత్రిక వారి సావిత్రిబాయి పూలే అవార్డు, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక వారు జాతీయ తెలుగు కీర్తి పురస్కారాలు అందుకున్నట్లు ఆమె తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న బైరపోగు బెన్నమ్మ వేణుగోపాల్

దేశానికి సేవలు అందించేందుకు సిద్ధం



దేశానికి సేవలు అందించేందుకు సిద్ధమని ప్రకటిస్తున్న మాజీ సైనికులు

కర్నూలు(అగ్రికల్చర్): ఇండియా–పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మాతృ దేశానికి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నూలు మాజీ సైనికులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు దేశానికి సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న మాజీ సైనికుల పేర్లతో కూడిన జాబితాను పంపామని మాజీ సైనికులు ప్రకటించారు. యుద్ధ సమయంలో దేశానికి సేవలు అందించేందుకు మరికొంత మంది ఆసక్తితో ఉన్నారని, వీరితో త్వరలోనే రెండవ జాబితాను పంపుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ నుంచి ఎపుడు ఆదేశాలు వచ్చినా దేశ సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో ఎటువంటి బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

రమణీయం..రథోత్సవం



ఎగువ అహోబిలంలో భక్త జనం మధ్య రథోత్సవం

ఆళ్లగడ్డ: భక్తుల గోవింద నామస్మరణలు.. పండితుల మంత్రోచ్చారణలు.. డప్పుల వాయిద్యాల మధ్య శ్రీ జ్వాలా నరసింహుడి రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. అహోబిలేశుడి జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు శనివారం ఎగువ అహోబిలంలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలు, పసిడి ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్లను ఉంచి ఉత్సవాన్ని ప్రారంభించారు. మాడ వీధుల్లో రథోత్సవం కనుల పండువగా సాగింది.

అదనపు హెచ్ఆర్ఏ తొలగించడం అన్యాయం



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న ఎంఎన్‌వోలకు జిల్లా ట్రెజరీ అధికారి అదనపు హెచ్‌ఆర్‌ఏ తొలగించడం అన్యాయమని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు స్వామి నాయక్ ఖండించారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983లో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు రామచందర్ ప్రభుత్వంతో చర్చించి ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలకు అదనపు హెచ్‌ఆర్‌ఏను మంజూరు చేయించారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకుండానే ఎంఎన్‌వోలకు ఉన్న అదనపు హెచ్‌ఆర్‌ఏను జిల్లా ట్రెజరీ అధికారి తొలగించారని విమర్శించారు. సమావేశంలో యూనియన్ ట్రెజరర్ సురేష్, సార్జంట్ ఉరుకుందయ్య, చెన్నయ్యదాస్, వెంకటేశ్వర్లు, నవీన్, రాజేష్, రవి, మల్లికార్జున, లోకేశ్వరరావు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆసుపత్రులకు వచ్చిన పేద, మధ్యతరగతి రోగులకు అవసరం లేకపోయినా పరీక్షలు నిర్వహించి విచ్చల విడిగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతులు లేకుండా ల్యాబ్‌లు నడస్తున్నాయన్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికెట్లు లేకున్నా కొందరు సిబ్బందితో పని చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. వ్యాపారం కోసం మందులు అధికంగా అంటగడుతున్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని కలెక్టర్ ఆదేశించినా కొన్ని ఆసుపత్రులు బేఖాతర్ చేయిస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు వీరేష్, హుస్సేన్‌బాషా, మైనుద్దీన్, మహేష్, శ్రీనివాసులు, అంజి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

భవన కార్మికుడికి గాయాలు

కర్నూలు (టౌన్): స్థానిక గుత్తిపెట్రోల్ బంకు సమీపంలోని నిర్మాణం జరుగుతున్న ఇంటిపై నుంచి ఓ కార్మికుడు కింద పడి గాయపడ్డాడు. స్థానిక తుంగభద్ర కాలనీలో రెండు అంతస్తుల భవనంలో నిర్మాణ పనులు చేస్తున్న నిర్మల్ నగర్‌కు చెందిన భరత్ (19) అనే కార్మికుడు ప్రమాదవశాత్తూ పైనుండి కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కార్మికుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న నాలుగవ పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదం

కర్నూలు : కర్నూలు శివారు బీక్యాంప్‌లోని టీజీ ఫంక్షన్ హాల్ దగ్గర ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద జనరేటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం జనరేటర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అగ్ని మాపక సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అయినప్పటికీ రూ.1.9 లక్షలు నష్టం వాటిల్లినట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు అంచనా వేశారు.

లూపస్‌తో రోగనిరోధక వ్యవస్థ తిరగబెడుతుంది

కర్నూలు(హాస్పిటల్): శరీరానికి రక్షణగా ఉండాల్సిన రోగనిరోధక వ్యవస్థే తిరగబడటంతో లూపస్ అనే వ్యాధి వస్తుందని రుమటాలజిస్టు డాక్టర్ ఎ.సృజన చెప్పారు. వరల్డ్ లూపస్ డే సందర్భంగా శనివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.సృజన మాట్లాడుతూ రోగనిరోధక శక్తి సహజంగా బయట నుంచి బ్యాక్టీరియా, వైరస్, కావర్ల్ కణాల నుంచి కాపాడుతుందని, కానీ ఈ ఆటోఇమ్యూన్ డిసీజ్‌లో వ్యాధినిరోధక శక్తి మన శరీర కణాలపై దాడి చేస్తుందని, దాని వల్ల శరీరంలో ఒక్కో కణజాలంపై దీని ప్రభావం ఉంటుందన్నారు. ఈ వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవడం వల్ల త్వరగా కోలుకోవచ్చన్నారు. ఈ వ్యాధి భారిన అన్ని వయస్సుల వారు గురయ్యే అవకాశం ఉందన్నారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి జబ్బు ఉన్న వారైనా దీర్ఘకాలంగా సమస్యతో బాధపడే అవసరం లేదని, సరైన చికిత్స తీసుకుని సమస్యకు దూరంగా ఉండాలని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు ఎంపీపీ హాలులో నిర్వహించిన సమ్మె కార్యచరణలో వారు మాట్లాడుతూ..నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దు చేయడంతో కార్మికులు బానిసలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీనచేపట్టే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆల్‌ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శిబి.నాగరాజు, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రఘుబాబు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమణ, పోస్టల్ యూనియన్ నాయకులు ఈశ్వర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌రాష్ట్ర కార్యదర్శి జే.లలితమ్మ పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి..

కార్మికులను బానిసలుగా మార్చే కార్మిక కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, విజయ్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు సగ్రమైన చట్టం చేయాన్నారు. లేబర్ కోడ్‌ల రద్దుతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. 20వ తేదీనజరిగే సార్వత్రిక సమ్మెకు మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు ఓ ప్రకనటలో కోరారు. ఈ సమ్మెలో కార్మికుల హక్కుల కోసం గళం విప్పనున్న నేపథ్యంలో ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మునెప్ప, ఎండీ అంజిబాబు

కొనసాగుతున్న సీహెచ్‌ఓల ఆందోళన

– మద్దతు తెలిపిన ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): డిమాండ్ల పరిష్కారం కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వోలు) గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న ఆందోళన శనివారం కూడా కొనసాగింది. స్థానిక ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.వెంగళ్‌రెడ్డి, ఇతర నాయకులు వచ్చి సీహెచ్‌వోలకు మద్దతు తెలిపారు. వారి డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీ ఎంసీఏ ప్రెసిడెంట్ చందన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తాము చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుందని, కానీ ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, చర్చలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్స్‌లో భాగంగా 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, తాలూకా అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, నగర అధ్యక్షులు కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, కోడుమూరు తాలూకా అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం కార్యదర్శి బంగారి, ఏపీ ఎంసీఏ వర్కింగ్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, సెక్రటరి నాగరాజు, ట్రెజరర్ కార్తీక్, అఖిల్ పాల్గొన్నారు.



సీహెచ్‌ఓల శిబిరంలో మాట్లాడుతున్న ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. వెంగళ్‌రెడ్డి

రేపు అన్నమయ్య జయంత్యుత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ దండగేరిలోని శ్రీ సీతారాముల దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కర్నూలు శారదా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విశ్రాంత అధ్యాపకులు సి.సరస్వతమ్మ పర్యవేక్షణలో సంగీత కళాకారులతో అన్నమయ్య సప్తగిరి సంకీర్తనలు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలని తెలిపారు.

నేడు నరసింహ చతుర్దశి

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరి జగన్నాథ మందిరంలో నరసింహ చతుర్దశి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నరసింహ హోమం, సామూహిక తులసీదళ పుష్పార్చన సేవ, రాజభోగ హారతి, ×శ్రీనరసింహ లీలలు₹ పై పూజ్య శ్రీ హేమ హరి ప్రభుచే ప్రత్యేక ప్రవచనం, సాయంత్రం తులసీ హారతి, సంధ్య హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలన్నారు.

వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. టీకాలు వేసిన పిల్లలు, గర్భిణుల వివరాలు యు విన్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. కిల్కారి మెసేజ్ సేవల గురించి గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి

కర్నూలు కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు పసుపులేటి నీలిమ తెలిపారు. కర్నూలు బుధవారపేట శ్రీ సూర్య కళా కల్చరల్ అకాడమీ నిర్వాహకులు సుధాకర్ బృందంచే శ్రీ వెంగమాంబ, శ్రీ అన్నమాచార్యుల సంకీర్తనలు, కర్నూలు శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం అధ్యక్షుడు నాగమల్లీశ్వరమ్మ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, మాతృశ్రీ వెంగమాంబ జీవిత విశేషాలపై ప్రముఖుల ప్రవచనాలు ఉంటాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



విగ్రహాలకు పూజలు చేసిన దృశ్యం

కర్నూలు కల్చరల్: ఆదిత్యనగర్‌లోని శ్రీ సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరంలో శనివారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో శ్రీ విఘ్నేశ్వర, శ్రీ సాయి, సుబ్రహ్మణ్యేశ్వర, పార్వతీ పరమేశ్వర, దత్తాత్రేయ స్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య నాయకులు పూజల్లో పాల్గొన్నారు. శ్రీ సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉషా మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): ఉషా మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తే మంచి అవకాశాలు ఉంటాయని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శనివారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉషా క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషా లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడంతో విద్యార్థుల్లో ఆత్మరక్షణతో పాటు సమాజ రక్షణ వంటి పోరాట పటిమ అలవడుతుందన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న ఉషా మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉషా సంఘం కార్యదర్శి టీ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్

కర్నూలు (టౌన్): సారా తయారీ, విక్రయాలు వీడి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ అన్నారు. శనివారం కర్నూలు నగర శివారులోని మునగాల పాడు గ్రామంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన, మద్యపాన విముక్తి పేరుతో ప్రతి రెండవ శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాటు సారా, మద్యపానం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్య లు, ఇతర అనర్థాలు వస్తాయన్నారు. ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

బంగారు పేటలో ఎక్సైజ్ దాడులు

స్థానిక బంగారుపేటలో శనివారం ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి వినియోగించే 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఈఎస్, రాజశేఖర్ గౌడ్, రామకృష్ణా రెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, ఎస్ఐ నవీన్ బాబు, వెంకటరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సినీ నిర్మాత ఆర్థిక సాయం

డోన్: ప్రధానమంత్రి సహాయ నిధితో పాటు ఆపరేషన్ సింధూర్‌లో మృతి చెందిన సైనికుడికి, పహల్గాంలో మృతి చెందని కశ్మీర్ యువకుడికి సినీ నిర్మాత మహేష్‌ఖన్నా రూ.33 వేల ఆర్థిక సాయం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. పహల్గాం టూరిస్టు ప్రదేశానికి పర్యాటకులను గుర్రపు స్వారీపై తీసుకువెళ్లిన కశ్మీర్ యువకుడు సయ్యద్ ఆదిల్ హుసేన్‌ను తీవ్రవాదులు చంపడం ఆవేదన కలిగించిందన్నారు. పీఎం సహాయనిధికి రూ.11వేలు, ఆదిల్‌హుసేన్ కుటుంబానికి రూ.11వేలు, ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ కుటుంబానికి రూ.11వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను మహేష్‌ఖన్నా కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని బైర్లూటి (బాలికలు), పాణ్యం (బాలురు), ఆళ్లగడ్డ (బాలురు) గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి ఎ.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 3వ తరగతి నుంచి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీలోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. వివరాలకు 6301565831 (బైర్లూటి), 9959758919 (పాణ్యం), 9676010006 (ఆళ్లగడ్డ) నంబర్లను సంప్రదించాలని సూచించారు.